www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 14 మార్చి 2024



15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న జిల్లాస్థాయి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల నుండి 5.30 గంటల వరకు ఏలూరులోని సిఆర్‌రెడ్డి డిగ్రీ కాలేజీలోని ఆడియో విజువల్ హాల్‌లో కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫోరమ్, డిస్ట్రిక్ట్ హెడ్స్ ప్రివెంటివ్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్, లీగల్ మెట్రాలజీ, డిస్ట్రిక్ట్ కన్స్యూమ్ ఇన్ఫర్మేషన్ సెంటర్, మండల్ కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్, వినియోగదారుల సంబంధిత విభాగాలవారు పాల్గొంటారని ఆమె తెలిపారు.

మాజీ ఎంఎల్ఎ శివ రూటెటు..?

కుదిరితే వైసిపి.. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి

ఇప్పటికే శివ కార్యాలయంలో టిడిపి ఫ్లెక్సీల తొలగింపు

కంచుకోటలో టిడిపికి ఎదురు దెబ్బేనా..!

రసవత్తరంగా ఉండి రాజకీయం



ప్రజాశక్తి - భీమవరం

టిడిపికి కంచుకోటగా పేరొందిన ఉండి నియోజకవర్గంలో ఆ పార్టీకి ఈసారి ఎదురుదెబ్బ తగలనుందా.. మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామ రాజు వైసిపి నుంచి పోటీ చేస్తారా.. లేక స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా.. అసలు శివరామరాజు ఏ మేరకు ప్రభావం చూపుతారు.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే టిడిపి, వైసిపిల్లో ఎవరికి నష్టం అనే అంశాలపై జిల్లాలోనే విస్తృత చర్చ సాగుతోంది. ఇప్పటికే శివరామరాజు తన కార్యాలయంలో టిడిపి ఫ్లెక్సీ బ్యానర్లను తొలగించడం, ఆపై వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తానని ప్రకటించంతో ఉండి రాజకీయం ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. టిడిపి ఆవిర్భావం నుంచి ఉండి నియోజకవర్గంలో ఒక్కసారి మినహా మిగిలిన ఆరుసార్లు టిడిపినే గెలుపొందింది. శివ తిరుగుబావుటాతో ఈసారి కంచుకోటలో టిడిపికి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. 2009, 2014ల్లో టిడిపి ఎంఎల్ఎగా గెలుపొందిన శివ 2019లో అధిష్టానం ఆదేశాల మేరకు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. రామరాజు, శివల మధ్య తొలుత మంచి సాన్నిహిత్యం ఉన్నప్పటికీ కాలక్రమంలో ఇరువురి మధ్య దూరం పెరిగింది. దీంతో వేర్వేరు కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగడంతో టిడిపి శ్రేణుల్లోనూ ఒకింత గందరగోళం నెలకొంది. ఈ క్రమంలోనే టిడిపికి చెందిన పలువురు వైసిపి గూటికి చేరారు. ఈ క్రమంలో టిడిపి అధిష్టానం సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకే మరోసారి టిక్కెట్ ప్రకటించ డంతో శివ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బహిరంగంగానే అధిష్టానం నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శివరామరాజు టిడిపికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు వైసిపిలో చేరుతున్నట్లు ప్రచారం సాగింది. అయితే తాను వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేస్తానని, ఏ పార్టీ తరఫున అనేది శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రకటిస్తాననడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. శివ వైసిపి నుంచి పోటీ చేస్తారా లేక టిడిపి రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటారా అనే దానిపై చర్చ పెద్దఎత్తున సాగుతోంది. ఇప్పటికే వైసిపి అధిష్టానం సూచన మేరకు జిల్లాకు చెందిన కొంతమంది నేతలు శివరామరాజుతో మంతనాలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇదే వాస్తవమైతే డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నర్సింహరాజు పరిస్థితి ప్రశ్నార్థకమవుతోంది. ఏదేళ్లుగా పార్టీని ముందుకు నడిపిస్తున్న పివిఎల్ వచ్చే ఎన్నికల్లో తానే బరిలో ఉంటానని ఇటీవల ప్రకటించారు. ఏదేమైనా శివరామరాజు బరిలో నిలిస్తే టిడిపికి ఎక్కువ నష్టం చేకూరుతుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. శివ అడుగులు ఎటువైపు అనేది శనివారం సాయంత్రం వరకు వేచిచూడాల్సిందే.

పోటీలో ఉంటా.. ఏ పార్టీ అనేది త్వరలో ప్రకటిస్తా

ఉండి మాజీ ఎంఎల్ఎ వి.శివరామరాజు

కాళ్ల : వచ్చే ఎన్నికల్లో తాను ఉండి నియోజకవర్గం నుంచే పోటీలో ఉంటానని మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) స్పష్టం చేశారు. భీమవరంలోని శివరామరాజు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా శివ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలందిస్తూ 2009, 2014 ఎన్నికల్లో ఉండి ఎంఎల్ఎగా టిడిపి తరపున గెలుపొందానని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు తాను నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యాయన్నారు. తాను ఎంతో కష్టపడి పేరు తెచ్చుకున్నానని, ఆ విషయం తెలిసి కూడా టిడిపి అధిష్టానం తనకు టిక్కెట్ కేటాయించకపోవడం దారుణమన్నారు. కనీసం తనతో సంప్రదించకుండానే సిట్టింగ్ ఎంఎల్ఎను అభ్యర్థిగా ప్రకటించడం కలిచివేసిందన్నారు. తాను పోటీలో ఉండాలని నియోజకవర్గంలో ప్రజలు కోరుకుంటున్నారన్నారు. దీని దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చానని తెలిపారు. ఏ పార్టీ తరఫున పోటీ చేస్తాననేది త్వరలోనే తెలియజేస్తానన్నారు.

ఇవిఎంలపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఇవిఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రజలకు అవగాహన కోసం ఏర్పాటు చేసిన మోడల్ ఇవిఎం, వివి పాట్‌లను బుధవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఇవిఎంల వినియోగంపై ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు ప్రతిరోజూ ఎంతోమంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారని, వారికి కూడా తమ ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్గించి, ఇవిఎం వినియోగం, వివి పాట్‌ల పనితీరును తెలియజేయాలన్నారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ డి.పుష్పమణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్


ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల సమయంలో ప్రజల నుండి అందే ఫిర్యాదులపై సమగ్ర చర్యలు తీసుకునేలా సిబ్బందికి శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్, పర్యవేక్షణా కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రజలు ఫిర్యాదుల రూపంలో తెలియజేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్లు 18002331077, 1950 ఏర్పాటు చేశామని, ఈ నెంబర్లకు ప్రజలు తమ ఫిర్యాదులు తెలియజేయవచ్చని అన్నారు. ఫిర్యాదు చేసే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సదరు టోల్ ఫ్రీ నెంబర్‌పై విస్తృత ప్రచారం ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ డి.పుష్పమణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీవిశ్వేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం భూములు గిరిజనులకు ఇవ్వాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టులో పరిహారం పొందిన భూములను అర్హులైన పేదలకు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. బుధవారం ధవళేశ్వరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ అధికారికి, కెఆర్‌పురం ఐటిడిఎ పిఒ సూర్యతేజకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసి భూములిచ్చి ప్రాజెక్టుకు సహకరిస్తున్న కుక్కునూరు మండల నిర్వాసితులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మండలంలో ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున సుమారు ఎనిమిది సంవత్సరాలు క్రితం అర్హులకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చిందని, అయితే ప్రభుత్వం వ్యక్తిగత ప్యాకేజీ చెల్లించక పోవడం వల్ల నిర్వాసితులంతా ఇక్కడే ఉండి వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. భూమి లేక, వ్యక్తిగత పరిహారం లేక, ఉపాధి లేక నిర్వాసితులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్వాసితులకు పరిహారం ఇచ్చి తరలించే వరకూ నష్ట పరిహారం పొందిన భూములను భూమిలేని పేదలకు పంచి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు యర్నం సాయికిరణ్, నిర్వాసితులు కొండ్రు నరసింహారావు, సోడే సత్యవతి, సరియం హరనాథ్, మిడియం తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహనా ర్యాలీ

92 శాతం ఓటింగ్ పెంచాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశం : డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న డిపిఒ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లాలో రానున్న ఎన్నికలలో ఎథికల్ ఓటింగ్ జరిగే విధంగా, పోలింగ్ శాతం పెంచే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు జరుగుతున్నాయని స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఈదర సుబ్బమ్మదేవి నగర ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో ఓటుహక్కు వినియోగంపై ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించి, భవిష్యత్తు ఓటర్లతో ఓటుహక్కు వినియోగంపై బుధవారం మాట్లాడారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 79.77 శాతం రాష్ట్రంలో పోలింగ్ నమోదు కాగా జిల్లాలో 83.75 శాతం నమోదు అయ్యిందన్నారు. జిల్లాలో అత్యల్పంగా ఏలూరు నియోజకవర్గంలో ఓటింగ్ శాతం 68.10 శాతంగా నమోదైందని, ఇది రాష్ట్ర ఆవరేజ్ కన్నా తక్కువని, భవిష్యత్తు ఓటర్లైన విద్యార్థులకు వివరించారు. జిల్లాలో 409 పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్రంలో నమోదైన పోలింగ్ శాతం కన్నా తక్కువ ఓటింగ్ నమోదైందని, దీనికి ప్రధాన కారణం పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఎగువ శ్రేణి వర్గం, యువత ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కాకపోవడమని తెలిపారు. అందుకే రానున్న ఎన్నికలలో 92 శాతం ఓటింగ్ శాతం పెంచే విధంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఓటర్స్ టర్న్ అవుట్ ప్రణాళికను ఆమోదించారని, దానిలో భాగంగా జిల్లాలో అన్ని ప్రాంతాలలో స్వీప్ కార్యక్రమాలు చేపడుతూ ఓటర్లను చైతన్య పరుస్తున్నామని డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. అనంతరం విద్యార్థులతో నినాదాలు చేయిస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ షరీఫ్, కె.లీలా ధరిణి, మాధవి లత పాల్గొన్నారు.

40 వేల మంది విద్యార్థులతో స్వీప్ కార్యక్రమాలు: డిఇఒ

జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో భవిష్యత్తు ఓటర్లైన విద్యార్థులతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం అన్నారు. జిల్లా వ్యాప్తంగా 191 జెడ్‌పి స్కూల్స్‌లో, 7 మున్సిపల్ స్కూల్స్‌లో విద్యార్థులతో క్విజ్, ర్యాలీలు, మానవహారం తదితర కార్యక్రమాలు చేపట్టగా సుమారు 40 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

'పిఎంశ్రీ'కి గుండుగొలను, పూళ్ల జెడ్‌పి స్కూళ్లు ఎంపిక

సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త సోమశేఖర్

ప్రజాశక్తి - భీమడోలు

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పిఎంశ్రీ) పథకం అమలుకు మండలంలోని గుండుగొలను, పూళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త సోమశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం గుండుగొలను హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నాడు-నేడు పనుల ప్రగతి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, విద్యార్థుల ద్వారా ట్యాబులతో పాటు విద్యా కానుక ఇతరాల వినియోగం, పాఠశాలలో నూతనంగా సమకూర్చిన విద్యా బోధన పరికరాల వినియోగం గురించి పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. వారు నూరు శాతం అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు కృషి చేయాలని కోరారు. ఈమేరకు ఉపాధ్యాయులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిఎంశ్రీ పథకం అమలులో భాగంగా మండలంలోని గుండుగొలను హైస్కూల్ తొలి విడతలో, పూళ్ళ హైస్కూలు రెండవ విడతగా ఎంపికయ్యాయన్నారు. ఈమేరకు పథకం ద్వారా క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించే క్రమంలో 2022-23 విద్యా సంవత్సరం నుంచి 2026-27 విద్యా సంవత్సరం వరకు గల ఐదు సంవత్సరాల కాల వ్యవధిలో ఒక్కొక్క పాఠశాల అభివృద్ధికి సంవత్సరానికి రూ.5 లక్షల ప్రాతిపదికన రూ.25 లక్షలు విడుదలవుతాయని తెలిపారు. తొలి విడతలో ఎంపికైన గుండుగొలను హైస్కూల్‌కు పాఠశాల ఆటస్థలం అభివృద్ధి కోసం తొలుత రూ.లక్ష నిధులు విడుదలయ్యాయని, పనులు వెంటనే ప్రారంభించాలని భీమడోలు మండల విద్యాధికారి భాస్కర్ కుమార్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలను కోరారు. పూళ్ళ హైస్కూల్ నుంచి పాఠశాల అభివృద్ధి కోసం అవసరమైన నివేదిక సమర్పిస్తే దానికి సైతం నిధుల విడుదల జరుగుతుందన్నారు. మిగిలిన ప్రతిపాదిత అంశాలలో ప్రాధాన్యత ఆధారంగా తక్కిన నిధులు విడుదలవుతాయని తెలిపారు. నాడు-నేడు పథకం కింద పాఠశాలకు మంజూరైన 9 అదనపు తరగతి గదులలో ఆరు గదులు నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఆర్.రామారావు పాల్గొన్నారు.




పరిశీలిస్తున్న సోమశేఖర్

భీమవరం జనసేన అభ్యర్థిగా అంజిబాబు

టిడిపి, జనసేన శ్రేణులతో పట్టణంలో ర్యాలీ

పవన్‌కళ్యాణ్ ఇక్కడి నుంచి పోటీలో లేనట్లే



ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో బరిలోకి దిగే జనసేన అభ్యర్థిపై ఎట్టకేలకు స్పష్టత లభించింది. ఇక్కడి నుంచి మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పోటీ చేయనున్నారు. అయితే మొదటి నుంచి ఇక్కడ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని ప్రచారం సాగుతున్నప్పటికీ మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పవన్ ఇక్కడ నుంచి పోటీ చేయడం లేదని తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే అంజిబాబు మంగళవారం జనసేనలో చేరిన సంగతి తెలిసిందే. ఒకరోజు వ్యవధిలోనే అంజిబాబుకు జనసేన అధిష్టానం నుంచి బుధవారం పిలుపు రావడంతో మంగళగిరి వెళ్లారు. ఆయనకు టికెట్ కేటాయిస్తున్నట్లు పవన్ స్పష్టత ఇచ్చారు. దీంతో మంగళగిరి నుంచి తిరిగొస్తున్న అంజిబాబుకు కృష్ణా జిల్లా సరిహద్దు ప్రాంతమైన లోసరి వద్ద టిడిపి, జనసేన శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అక్కడ నుంచి డిఎన్ఆర్ కళాశాల రోడ్డు మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి అంజిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. భీమవరం టిక్కెట్ ఇస్తున్నట్లు అధినేత పవన్ తనతో చెప్పారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచి పవన్ కళ్యాణ్ కానుకగా ఇస్తానని చెప్పారు. ముఖ్యంగా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట వీరవాసరం జెడ్‌పిటిసి గుండా జయ ప్రకాష్ నాయుడు, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉంగుటూరు జనసేన అభ్యర్థిగా ధర్మరాజు!

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజుకు టిక్కెట్ ఖరారైనట్లు సమాచారం. బుధవారం మంగళగిరిలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తో ధర్మరాజు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పవన్ ధర్మరాజుకు సీల్డ్ కవర్ అందించారు. దీంతో ధర్మరాజుకు టిక్కెట్ ఖరారైందని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. దీనిపై గురువారం అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలున్నాయి.

నిడమర్రు మండలం చిననిండ్రకొలను (పత్తేపురం)కు చెందిన ధర్మరాజు ఆక్వా ఆధారిత పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో ఉన్నారు. జనసేన పార్టీలో క్రియాశీలంగా ఉంటూ ఉంగుటూరు నియోజకవర్గ నేతగా పార్టీని బలోపేతం చేశారు. లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ పేరుతో అనేక సేవా కార్యక్రమాల్లో ధర్మరాజు ముందున్నారు.



ధర్మరాజుకు సీల్డ్ కవర్ అందిస్తున్న పవన్

తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా వీరవాసరం వాసి

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం గ్రామం నుండి అనేక మంది ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, న్యాయ శాఖల్లో ఉన్నత స్థానాల్లో ఉండి గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తెస్తున్నారు. ఇదే కోవలో వీరవాసరం గ్రామానికి చెందిన వీరవల్లి కనకరత్నం తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా నియమితులయ్యారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కనకర్నతం ప్రాథమిక, ఉన్నత విద్య వీరవాసరంలోని మండల పరిషత్, ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాగింది. ఇంజినీరింగ్ విద్య వీరవాసరం ఎంఆర్‌కె పాలిటెక్నిక్, భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో సాగింది. ఎపిపిఎస్‌సి ద్వారా జోన్-6 నుండి ఎఇఇగా నియమితులు కావడంతో అప్పటి నుండి తెలంగాణ కేడర్లో కొనసాగుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌లో ఎఇఇగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన కనకరత్నం అదే జిల్లా అచ్చంపేట సబ్‌డివిజన్ డిఇఇగా, మెదక్ సబ్‌డివిజన్ ఇఇగా, నిజామబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, వనపర్తి డివిజన్‌ల్లో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా, మెదక్, కరీంనగర్ సర్కిళ్లలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారు. ప్రస్తుతం నిజామాబాద్ జోన్‌లో విధులు నిర్వర్తిస్తున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనకరత్నంను పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రజాశక్తి ఆయనను ఫోన్‌లో సంప్రదించగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసించిన వారు ఉన్నత స్థానాల్లో ఉంటారనడానికి తన ఎదుగుదలే నిదర్శనమన్నారు. తాను ఈ స్థాయికి రావడానికి కారణమైన గురువులకు, గ్రామస్తులకు తాను రుణపడి ఉంటానన్నారు. తెలంగాణ ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకంతో ఉత్తమ సేవలందిస్తూ పుట్టిన గడ్డకు పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తానని తెలిపారు.



వీరవల్లి కనకరత్నం

'పిఎం విశ్వకర్మ యోజన'పై మండల కమిటీలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై మండలస్థాయి కమిటీలను నియమించాలని ఆ పథకం జిల్లాస్థాయి అమలు కమిటీని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలస్థాయిలో పిఎం విశ్వకర్మ యోజన కమిటీని నియమించాలని, దీనిలో ఎంపిడిఒ, ఎపిఎం, ఎఎస్‌డబ్ల్యూఒ, ఎటిడబ్ల్యూఒ (ట్రైబల్)లను సభ్యులుగా ఉంచాలన్నారు. బ్యాంక్ నోడల్ పర్సన్‌గా యూనియన్ బ్యాంకు, ఎస్‌బిఐ వారిని నియమించాలన్నారు. దీనికి సంబంధించిన ఫార్మేట్‌ను రూపొందించి మండల కమిటీకి పంపించాలని, ఆ ఫార్మేట్ ప్రకారం దరఖాస్తుదారుడు వివరాలను పొందుపర్చాలన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ద్వారా దరఖాస్తులను పరిశీలించి గతంలో వృత్తిపరంగా చేపట్టిన ఫొటోతో సహా దరఖాస్తును మండల కమిటీ స్క్రూట్నీ చేసి జిల్లా కమిటీకి పంపాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ జిల్లా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ప్రతి రెండు గంటలకూ పర్యవేక్షిస్తూ నివేదికను రెండు, మూడు రోజుల్లో అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపిడిఒకు సంబంధించి జెడ్‌పి సిఇఒ, పంచాయతీలకు సంబంధించి డియొ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. తొలుత జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించి మొత్తం 70,717 దరఖాస్తులు రాగా స్టేజీ-1 కింద 36402కు 34282 సిఫార్సు చేశామని, స్టేజ్-2 కింద 31969కి 2313 సిఫార్సు చేసి ఆమోదం నిమిత్తం కేంద్ర ప్రభుత్వానికి పంపామని వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, డిపిఒ టి.శ్రీనివాసవిశ్వనాథ్, లీడ్ బ్యాంక్ మేనేజరు నీలాద్రి, జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ మేనేజర్ ఎ.సుమధురవాణి, స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి గంటా సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో బుధవారం ఇంటర్మీడియట్ రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఏలూరు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు తెలిపారు. జిల్లాలో 51 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు మొత్తం 14,541 మందికిగాను 14 వేల మంది హాజరయ్యారని, 541 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. వీరిలో సాధారణ విద్యార్థులు 12,661 మందికి 12,257 మంది హాజరవ్వగా 404 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్యావిభాగంలో 1,880 మందికి 1,743 మంది హాజరవ్వగా 137 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 96 శాతం హాజరు నమోదయింది. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రభాకర్‌రావు తెలిపారు.

పర్యావరణహిత గ్రామంగా 'పోలసానిపల్లి'

సర్పంచి షేక్ రహీమా బేగం హసేన

ప్రజాశక్తి - భీమడోలు

పోలసానిపల్లి గ్రామాన్ని పర్యావరణహితంగా, పారిశుధ్య రక్షిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య పరిరక్షణపై సర్పంచితో పాటు, ఎంపిటిసి ఎ.దేవీ నాగేంద్రప్రసాద్ గ్రామ పరిధిలోని వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామం మీదుగా ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వెళ్లేందుకు రోడ్డు మార్గం ఉన్నందున గ్రామం పరిధిలో పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వివరించారు. ఇదే క్రమంలో గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్‌ల సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. ఇదేక్రమంలో తడి, పొడి చెత్త వేరువేరుగా విభజించి గ్రామపంచాయతీ ద్వారా అనుమతులు పొందిన పారిశుధ్య సిబ్బందికి అందించేందుకు అవసరమైన ప్లాస్టిక్ తొట్టెలను అందజేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం సుమారు మూడువేల ప్లాస్టిక్ తొట్టెలను సిద్ధం చేశామన్నారు. వీటి ఉచిత పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు. సేకరించిన చెత్తను గ్రామ పరిధిలో ఏర్పాటుచేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించేందుకు ఏర్పాటు చేశామన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆధునికీకరించామని తెలియజేశారు. గ్రామపంచాయతీకి అదనపు ఆదాయంగా మార్చే ఏర్పాట్లు జరుగుతున్నట్లు వివరించారు.



డస్టబిన్లు అందజేస్తున్న సర్పంచి

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్: ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తల సేమియా భవనంలో బుధవారం 13 మంది తలసేమియా వ్యాధి బాధిత చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించామని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌ వరప్రసాద్ రావు, చిన్నపిల్లల వైద్యుడు పి.ఆర్‌ఎస్ శ్రీనివాస్ చిన్నారులను పరీక్షించి, మందులను అందజేశారు.

రామసింగవరంలో భవిష్యత్ గ్యారంటీ

ద్వారకా తిరుమల: చంద్రబాబుతోనే అభివృద్ధి జరుగుతుందని, పార్టీ కార్యకర్తలు కలసికట్టుగా పని చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ అన్నారు. మండలంలోని రామసింగవరం గ్రామపంచాయతీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లంకా సత్యనారాయణ మాట్లాడారు.

ప్రమాదకర మార్జిన్ పూడ్చివేత

కామవరపుకోట: మండలంలోని ఉప్పలపాడు, గొల్లగూడెం మధ్యలో ఏలూరు, జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డుపై ప్రమాదకరస్థాయిలో ఉన్న రోడ్డు మార్జిన్‌ను ఎస్ఐ జయబాబు పూడ్చించి చదును చేయించారు. పొరపాటున వాహనదారులు చూడకుండా మార్జిన్‌లో దిగితే పెను ప్రమాదం జరుగుతుందన్నారు. రోడ్డు మార్జిన్‌ని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు తడికలపూడి ఎస్ఐ జయబాబు ఆధ్వర్యంలో బుధవారం మట్టితో పూడ్చి, చదును చేయించడం జరిగింది. ఈ మార్జిన్‌ని పూడ్చడం పట్ల ఈ రహదారి వెంబడి ప్రయాణించే వాహన చోదకులు తమ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటేశ్వరరావు మృతి బాధాకరం

కామవరపుకోట: గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పనులు నిర్వహిస్తున్న క్రేన్ ఢీకొని మంగళవారం మృతి చెందిన మండలంలోని తిమ్మని కుంట సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి దగాని వెంకటేశ్వరరావు మృతికి సిపిఐ మండల కార్యదర్శి టివిఎస్.రాజు, సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

చాట్రాయి: మండలంలోని మర్లపాలెం గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం బుధవారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి వెల్లి సూర్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ శిక్షణ కేంద్రంలో మహిళలకు మూడు నెలల పాటు ఈ ఉచిత కుట్టు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

మాదేపల్లిలో ఇళ్లపట్టాల పంపిణీ

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి, శ్రీపర్రు, కలకుర్రు, మల్కాపురం గ్రామాలలో బుధవారం దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. నవరత్నాల్లో భాగంగా మాదేపల్లిలో నిరుపేద లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. శ్రీపర్రు దగ్గర తమ్మిలేరుపై ఇంతకు ముందు పాలకులు ఎవరూ పట్టించుకోకుండా వదిలేసిన దీర్ఘకాలసమస్య తమ్మిలేరు వాగు వంతెన నిర్మాణానికి రూ.20.72 కోట్ల నిధులు మంజూరు చేయించి, వంతెన నిర్మించి, ప్రారంభించి ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా చరిత్ర సృష్టించారని మాదేపల్లి, శ్రీపర్రు గ్రామాల ప్రజలు కొనియాడారు.

కృష్ణారావుపాలెంలో 'మీ ఇంటికి మీ ముద్దరబోయిన'

చాట్రాయి: నూజివీడు నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ఇదివరకు ఎన్నడూ జరుగని పరిస్థితులు నెలకొన్నాయి. టిడిపి అధ్యక్షుడిగా కొనసాగుతూ సీటు నిరాకరించడంతో తనను నమ్మించి మోసం చేశారని భావోద్వేగానికి గురై, ఎలాగైనా నూజివీడులో టిడిపి అభ్యర్థిని ఓడించాలనే దృఢ సంకల్పంతో మీ ఇంటికి మీ ముద్దరబోయిన పేరుతో కార్యక్రమాన్ని చేపట్టారు. వైసిపి కండువాకప్పిన తరువాత మండలంలోని టిడిపికి మెజారిటీ గల కృష్ణారావుపాలెం గ్రామానికి బుధవారం పర్యటించారు. ప్రజలు ఘనంగా హారతులతో నీరాజనాలు పలికారు. మండలంలో ముద్దరబోయినకు మద్దతు తెలియజేస్తున్న అభ్యర్థులతో కలిసి భారీ బహిరంగ సభ త్వరలో ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

కలిదిండి : మండలంలోని చినతాడినాడ, పల్లెపాలెంలో రూ.6 లక్షల నిధులతో మంజూరైన జిఎస్‌డి రోడ్డు పనులను, ఎస్‌సి కాలనీలో రూ.15 లక్షలతో నిర్మాణం పూర్తైన సీసీ రోడ్లను, విభూరావుపేటలో రూ.7 లక్షలతో నిర్మించిన నూతన అంగన్వాడీ భవనాన్ని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. 27 రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. పడమటిపాలెంలో రూ.20.80 లక్షల నిధులతో నిర్మాణం పూర్తైన గ్రామీణ ఆరోగ్య కేంద్ర నూతన భవనాన్ని, గోపాలపురంలో రూ.5 లక్షల నిధులతో నిర్మాణం పూర్తైన మైక్రో ఫిల్టర్ పైపు లైనును ఆయన ప్రారంభించారు. నూతనంగా మంజూరైన 24 రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు.

పిఒ, ఎపిఒలకు శిక్షణ

బుట్టాయగూడెం: ఎన్నికల ప్రక్రియలో ప్రధానమైన పోలింగ్‌కు సంబంధించి విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల భూమిక అత్యంత కీలకమైందని ఐటిడిఎ పిఒ, ఆర్ఓ ఎం.సూర్యతేజ అన్నారు. బుధవారం మండలంలోని కెఆర్.పురం ఐటిడిఎలో పోలవరం నియోజకవర్గస్థాయి పిఒ, ఎపిఒలకు ఎన్నికల నిర్వహణ శిక్షణ కార్యక్రమం నిర్వహించి తెలియజేశారు.

'డాక్టర్ సలహాల మేరకే మందులు వాడాలి'

జంగారెడ్డిగూడెం టౌన్ : ప్రజలు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు వాడడం వల్ల డోస్ ఎక్కువై, ఆ ప్రభావం కిడ్నీపై పడి కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయని డాక్టర్ వజ్జి కిరణ్ తెలిపారు. ఈనెల 13వ తేదీన ప్రపంచ కిడ్నీ దినోత్సవం పురస్కరించుకొని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో ఆప్‌లో వారి సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన ప్రపంచ కిడ్నీ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వజ్జి కిరణ్, సుబ్బారావు విచ్చేసి మాట్లాడారు.

'ఉద్యోగం ఇప్పిస్తానని మోసం'

ముసునూరు: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మహిళను మోసం చేసిన వ్యక్తిపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన గద్దల ఆశ్వీరాదం ముసునూరు గ్రామానికి చెందిన దారెడ్డి బాలస్వామి అనే మహిళ దగ్గర నుంచి రూ.2 లక్షలు తీసుకుని మోసం చేశాడన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు.

వైసిపిలోకి పలువురు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధి, దెందులూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బలుసు గంగాధరరావు, మారశాల రవి, నల్లూరి రత్తగిరి, మారడి సీతారామయ్య, నాము బుర్ర రాజు, నారగాని లక్ష్మీలు బుధవారం వైసిపిలో చేరారు.

'నవరత్నాల పేర లబ్ధి పొందినట్లు ప్రచారం'

ముసునూరు: నవరత్నాల పేర పథకాల ద్వారా తక్కువ నగదు ఇచ్చి, ఎక్కువ లబ్ధి పొందినట్లు ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచడం చాలా విడ్డూరంగా ఉందని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు ఆరోపించారు. మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు గ్రామానికి చెందిన ఉండవల్లి నాగమణికి వైఎస్ఆర్ ఆసరా రాకుండానే పొందినట్లు నగదు ఎంత కావడం, విద్యాదీవెన రూ.40 వేలు ఇవ్వని రూ.1,72,000 ఇచ్చినట్లు చూపడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు.

నాటుసారా, గంజాయి విక్రయాలు నివారించాలి

ఏలూరు స్పోర్ట్స్: జిల్లాలో నాటు సారా, గంజాయి విక్రయాలు జరగకుండా చూడాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ గణపతి బాబుకు సూచించారు. జిల్లా ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరిటెండెంట్‌గా ఎ.గణపతి బాబు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడం అనంతరం జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

మోటార్ సైకిల్ దొంగల ముఠా అరెస్టు

ఉంగుటూరు: చేబ్రోలు పోలీస్ స్టేషన్‌తో పాటు పలు జిల్లాల్లో మోటార్ సైకిల్ దొంగతనం చేసే ముఠాను పోలీసులు చాకచక్యంతో పట్టుకున్నారు. ఈమేరకు కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వెల్లడించారు. ఉంగుటూరు, భీమడోలు మండలాలకు చెందిన ఐదుగురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 25 మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

వైఎస్ఆర్ చేయూత చెక్కులు అందజేత

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో స్థానిక వైకెపి, ఎపిఎం పద్మావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైయస్సార్ చేయూత కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. రూ.6 కోట్ల 46 లక్షల 68 వేల 750 చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

ఏలూరు టౌన్: దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి, జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌తో కలిసి పెదపాడు మండలం కలపర్రు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కలపర్రు గ్రామంలో జరిగిన వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంలో పాల్గొని 4,218 మంది అక్కచెల్లెమ్మలకు రూ.7,90,87,500 చెక్కును అందజేశారు. రూ.23.94 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అదే విధంగా మన బడి, నాడు-నేడు కింద రూ.22.25 లక్షల వ్యయంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

ఎన్‌జిఒలు సేవా దృక్పథంతో పనిచేయాలి

ఏలూరు అర్బన్: ప్రతిఫలం ఆశించకుండా సేవా దృక్పథంతో పనిచేయడమే ఎన్‌జిఒల లక్ష్యమని, సామాజికంగా వెనుకబడిన ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ ఎన్‌జిఒ సంఘాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ రిమోట్ ఏరియాలోని ప్రజలకు ఆరోగ్యం, విద్య మొదలైన విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే చెడు దృక్పథాలపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు ఉచిత న్యాయాన్ని అందించే ఉద్దేశంతో ఎల్ఎడిసి వ్యవస్థ పని చేస్తుందని, ఉచిత న్యాయ సేవలు అవసరమైన వారు పొందవచ్చని తెలియజేశారు.

'పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి'

ప్రజాశక్తి - భీమడోలు

పాడి పరిశ్రమ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు సద్వినియోగపరచుకోవాలని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహిమా బేగం హసేన్ కోరారు. రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గాలికుంట వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని సర్పంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన పొలసానిపల్లిలో రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పెంపకం, గొర్రెల పెంపకం అదనపు ఆదాయ వనరులుగా మారాయన్నారు. గ్రామ పరిధిలో సుమారు 1,200 గేదెలు, ఆవుల ద్వారా పాల ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఇదే క్రమంలో సుమారు 750 వరకు గొర్రెలు, మేకల పెంపకం జరిగి గ్రామస్తులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఆవులు, గేదెల పాలిట ప్రమాదకారిగా మారిన గాలికుంట వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేసేందుకు పశుసంవర్థక శాఖ అధికారులతో మాట్లాడి పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చేందుకు పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాడి రైతులు పశువుల బీమా పథకం, పశువుల కిసాన్ క్రెడిట్ కార్డు సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ ఇమ్మిడి సాయి రమేష్, మండల పశువైద్యులు డాక్టర్ రమ్యశ్రీ పశువులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని తమ సిబ్బంది సహకారంతో చేపట్టారు. శిబిరంలో గ్రామ పరిధిలోగల సుమారు వెయ్యికి పైబడిన పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి అంబటి నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - చాట్రాయి

ఆనాడు మహిళల ఐక్యత కోసం, పని గంటల విధానం కోసం అమెరికాలోని క్లారా జట్కిన్ ఎన్నో హక్కులను సాధించేందుకు ఎంతో కృషి చేశారని ... పెద్ద ఎత్తున పోరాటం చేసి ఎన్నో హక్కులను సాధించుకున్నామని ఐద్వా నాయకులు అక్కిరాజు శ్యామల, ఎల్.ప్రవస్య, పోలవరం మహిళా పోలీస్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని పోలవరం గ్రామంలో ఐద్వా, సిఐటియు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో లింగోజు సరిత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాడిన వారిని ఆదర్శవంతంగా తీసుకొని ఆ బాటలో నడవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే మహిళల కోసం ప్రత్యేక పాఠశాల స్థాపించి మహిళలకు విద్య నేర్పించారని, దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, రాజా రామ్మోహన్ రాయ్, మహాత్మ జ్యోతిరావు పూలే ఎన్నో పోరాటాలు చేశారని, వారి అడుగుజాడల్లో మనం నడవాలని, మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు.

మృతుని భార్యకు ఎన్ఆర్ఐ పేమెంట్ అందజేత

ఏలూరుటౌన్: పెదపాడు గ్రామానికి చెందిన వ్యక్తి విదేశంలో గుండెపోటుతో మరణించడంతో మృతుని భార్యకు ఎన్ఆర్ఐ పేమెంట్(ఇన్సూరెన్స్) కింద మంజూరు చేసిన రూ.7,48,693 చెక్కును జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అందజేశారు. పెదపాడు గ్రామానికి చెందిన తోట కావ్యవల్లి భర్త తోట అనుపమ కుమార్ అబ్రాడ్‌లో గుండెపోటుతో మరణించిన దృష్ట్యా బుధవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో తోట కావ్యవల్లికి భారత రాయబార కార్యాలయం నుంచి ఎన్ఆర్ఐ పేమెంట్‌ను జెసి అందజేశారు.

వీరుల త్యాగాలు, ఆవిష్కరణలు అధ్యయనం చేయాలి

నిడమర్రు: భవిష్యత్తు తరాల కోసం ఎందరో చేసిన త్యాగాలు, ఆవిష్కరణలు విద్యార్థులు నిరంతరం తెలుసుకోవాలని ఏలూరు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. మహనీయుల ఆశయాల కమిటీ నిడమర్రు మండల పరిధిలోని పాఠశాలల్లో జరుపుతున్న సమావేశాల్లో భాగంగా బుధవారం బువ్వనపల్లి, చాంద్రపాలెం, బావాయిపాలెం, క్రొవ్విడి, ఆదమిల్లి గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించారు. బువ్వనపల్లి యూపి స్కూల్‌లో హెడ్ మాస్టర్ ఎస్.ఎస్.సుబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఏలూరు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మండల ప్రచార కమిటీ సభ్యులు నారపల్లి రమణ రావు, కె.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువులు మార్కుల కోసం మాత్రమే కాదు జ్ఞానం కోసం చదవాలని సూచించారు. చదువుల తల్లి సావిత్రి బాయి పూలే, సంస్కర్తలు వివేకానంద, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, యోధులు భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, అష్ఫాఖుల్లా ఖాన్, మర్దర్పుల కారల్ మార్క్స్, సుందరయ్య, శ్రీశ్రీ, గుఱ్ఱం జాషువాలను, మండలానికి చెందిన విద్యా సంస్కర్తలు ఎన్నో సేవలు చేసిన చింతలపాటి మూర్తి రాజుల కృషిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అన్ని పాఠశాలలకు సూరెడ్డి శ్రీనివాసరావు స్పాన్సర్షిప్‌తో మన్యం విప్లవ సారథి అల్లూరి సీతారామరాజు చిత్ర పటాలు, వివిధ తేదీల ప్రాధాన్యత తెలిపే క్యాలెండర్, పెదనిండ్రకొలనుకు చెందిన కూనపరాజు కుమార్ రచించిన అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర బుక్స్‌ను మహనీయుల ఆశయాల ప్రచార కమిటీ తరుపున అందజేశారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 130 మంది హాజరు

ప్రజాశక్తి - కలిదిండి

ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 130 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు. మండలంలోని కోరుకొల్లు, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 140 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 130 మంది హాజరయ్యారన్నారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడతారని ఏలూరు ట్రాఫిక్ సిఐ శ్రీనివాసరావు వాహనదారులకు సూచించారు. నగరంలోని ఫైర్ స్టేషన్ సెంటర్‌లో హెల్మెట్ ధరించడంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ట్రాఫిక్ సిఐ శ్రీనివాసరావు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారికి ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పారామిలటరీ సిబ్బంది కవాతు

ప్రజాశక్తి - కామవరపుకోట

రానున్న ఎన్నికల దృష్ట్యా మండలంలోని కామవరపుకోట గ్రామ పంచాయతీలో చౌకర సెంటర్ నుంచి బస్‌స్టాండ్ సెంటర్ వరకు ఎస్ఐ జయబాబు ఆధ్వర్యంలో పారామిలటరీ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

'పౌష్టికాహారాన్ని తీసుకోవాలి'

భీమడోలు: బాలింతలు, కిశోర బాలికలు, గర్భిణులు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్య వంతులుగా కొనసాగాలని ఐసిడిఎస్ భీమడోలు సిడిపిఒ కె.విజయలక్ష్మి కోరారు. ప్రాజెక్టు పరిధిలో ఈనెల 23వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గుండుగొలను గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం సూపర్వైజర్ పర్యవేక్షకులు కె.కవిత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఒ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టిక విలువలు గల ఆహార స్టాల్లను పరిశీలించారు. మరింత మెరుగుగా చేపట్టేందుకు తగు సూచనలు చేశారు. వివిధ ఆరోగ్య అంశాలపై అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు రాజామణి, విజయ, ఇతరులు పాల్గొన్నారు.

నిలిచిన ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి స్కానింగ్ ఆగిపోయాయని అక్కడి సిబ్బంది చెప్పడంతో రోగులు తీవ్ర నిరాశతో వెనుతిరిగారు. సాఫ్ట్‌వేర్ సమస్య వల్లే సేవలు నిలిచాయని అక్కడి సాంకేతిక సిబ్బంది తెలిపారు. వాస్తవానికి ఇక్కడ స్కానింగ్ ఫిల్మ్ ఇవ్వకుండా ఉచితంగా చేస్తున్నారు. ఫిల్మ్ కావాలన్న వారి నుంచి రూ.2, రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించిన వారికి అర్జంట్ పేరిట ముందు తీస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. సాధారణ రోగులకు స్కానింగ్ కూడా వెంటనే తీయరు. రెండు నుంచి 10 రోజుల వరకు సమయం పెడుతుంటారు. అలా వేచి ఉన్న వారు ఇప్పుడు సేవలు నిలిచిపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని ఎంఆర్ఐ స్కానింగ్ సాఫ్ట్ వేర్ సమస్యను తక్షణం పరిష్కరించాలని పేద రోగులు కోరుతున్నారు.

'పార్టీలు ఫిరాయించే చరిత్ర మీదే'

ముసునూరు: ప్రత్యర్థి పార్టీల సొమ్ముతో పోటీకి దిగుతున్నానని ప్రచారం చేస్తున్న వారికి తాను ఒక్కటే చెబుతున్నానని అమ్ముడుపోయే వంశంలో తాను పుట్టలేదని, ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి ఆరు నెలల్లో ఫిరాయించిన చరిత్ర మీదే అన్న సంగతి గుర్తుంచుకోవాలని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం ముసునూరు మండలం రమణక్కపేట గ్రామంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పార్టీ ఎంఎల్ఏగా ఉన్న వ్యక్తి టిడిపి కండువా కప్పుకోకుండానే నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఇక్కడికి వచ్చారని, తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నానని ఆ విషయంలో అధికార పార్టీ తనకు డబ్బులు ఇస్తే పోటీ చేస్తున్నా అనే ప్రచారం చేస్తున్నారన్నారు. తాను ఒక్కటే సూటిగా ఆయన్ని ప్రశ్నిస్తున్నానని 1991లో ఎంపీగా పోటీ చేసి గెలిచిన మీ తండ్రి, ఆరు నెలలు తిరగకముందే పార్టీ ఎందుకు ఫిరాయించారో? చెప్పగలరా? చెప్పి ఇక్కడ పోటీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఏలూరు స్పోర్ట్స్: మసాజ్ సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రెండో పట్టణ సిఐ ప్రభాకర్ మసాజ్ సెంటర్ల నిర్వాహకులకు హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాలతో నగరంలోని 2, 3 పట్టణం పరిధిలో ఉన్న మసాజ్ సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. అందులో భాగంగా మసాజ్ సెంటర్లలో ఎమైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారా అనే అంశంలో పూర్తిగా సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ ప్రభాకర్ మాట్లాడుతూ మసాజ్ సెంటర్ల ముసుగులో ఎవరైనా ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడినట్లయితే దయల్ 100కు గాని దయల్ 112కి గాని దయల్ చేయాలని ఆయన సూచించారు.